క్లుప్తంగా

శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ముద్దనూరు : శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి విగ్రహాలకు అభిషేకం, అర్చన, ఆకుపూజ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అంజన్నకు పూజలు


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

పులివెందుల టౌన్ : శ్రావణ మాస మూడవ శనివారం సందర్భంగా పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం, పీడబ్ల్యూ కాలనీ, కోతి సమాధి ఆలయం అభయాంజనేయస్వామి ఆలయం, పాత మార్కెట్ పడమటి ఆంజనేయస్వామి, ఆర్ఆర్ లే అవుట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయాలకు భక్తులు చేరుకుని ఆకు పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

వైభవంగా గ్రామోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్.పాలగిరి గ్రామంలో శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్‌శర్మ ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజలు జరిపించారు. తాళాల భజన భక్తులను ఆకట్టుకొంది. మధ్యాహ్నం 3 గంటలకు ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

తొండూరు : మండల పరిధిలోని స్థానిక జూనియర్ కళాశాలలో ప్రభుత్వం అందించిన బ్యాగులను శనివారం ప్రిన్సిపాల్ మురళీధర రావు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు.

అన్నదానం గొప్పది

వేంపల్లె : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని వేంపల్లె పట్టణ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. కడప రోడ్డులో ఉన్న హనుమాన్ జంక్షన్ వద్ద ప్రతి శ్రావణమాసం మూడవ శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించి మాట్లాడారు. గాజుల పేటకు చెందిన పసుపులేటి బాబు, దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తారు.

చక్రాయపేట : ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన మండలంలోని సురభి గ్రామం నాగలగుట్టపల్లె వద్ద ఉన్న దశరథ మహారాజు ఆలయం వద్ద శనివారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా గండికి వచ్చే భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు దశరథ తెలిపారు. ఈ కార్యక్రమానికి చక్రాయపేట ఎస్సీ హాస్టల్ వార్డెన్ కేశవులు, మణికంఠారెడ్డిలు సహకారాన్ని అందించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగప్రసాద్

సింహాద్రిపురం : వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ నెంబరు లేకుండా, నెంబర్ ప్లేట్ తొలగించినా కేసులు నమోదు చేస్తామన్నారు. నెంబర్ ప్లేట్‌లేని వాహనాలను ఉపయోగించి చైన్‌స్నాచింగ్‌లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు.

విజయవంతం చేయాలి

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో నిర్వహిస్తున్న ప్లాటినం జూబ్లీ సంబరాలను విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. సెప్టెంబర్ 13 నుంచి 15వ తేదీ వరకు వేడుకలను కళాశాలలో నిర్వహించనున్నామన్నారు.



ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి



మహిళలపై జరిగే దాడులపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కోర్టులు ఆలస్యం చేయకుండా నిందితులకు శిక్షలు విధించాలి. కలకత్తాలోని సంఘటన మరళ జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. విధులు నిర్వర్తిసున్న మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పించాలి. మహిళ భద్రతపై ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి వాటిని కాలయాపన లేకుండా శిక్షలు పడేవిధంగా ఉండాలి.

- డాక్టర్ సాయిచరితరెడ్డి, వైద్యాధికారిణి చిలంకూరు పీహెచ్‌సీ

అఘాయిత్యాలు చేసిన వారిని ఉరి తీయాలి



మహిళలపై అఘాయిత్యాలు చేసి హత్య చేసిన వారిని ఉరి తీయాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులు, బంధువులు, స్నేహితుల రాకపోకలపై నియంత్రణ ఉండాలి. రోగులు మృత్యువాత పడిన సందర్భాలలో వైద్య సిబ్బందిపై దాడులు జరుగకుండా నియంత్రించాలి.

- సుకన్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ కళాశాల, పులివెందుల

మహిళలకు భద్రత కల్పించాలి



కోల్‌కత్తా వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి కిరాతకంగా హతమార్చారు. ఈ సంఘటన యావత్ భారతదేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఆసుపత్రిలో వైద్యులతో పాటు సిబ్బంది ప్రాణ రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణను ఏర్పాటు చేయాలి.

- నీరజ, గైనకాలజిస్టు, పులివెందుల

చీనీ ధర పతనం.. నష్టాల్లో రైతులు


బి. కొత్తపల్లె చీనీతోటలో కోతకు సిద్ధంగా ఉన్న చీనీ పండ్లు


కొండాపురంలో చీనీ కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కొండాపురం : మండలంలోని చవ్వనాగాయపల్లె, యనమలచింతల, బి.కొత్తపల్లె, కె.రామిరెడ్డిపల్లె, కొట్టాపల్లె, బురుజుపల్లె, లావనూరు గ్రామాల్లో 5,600 వేల ఎకరాల్లో రైతులు చీనీ సాగు చేస్తున్నారు. రైతులకు కాసులు కురిపించే చీనీ తోటలు ప్రస్తుతం రైతులకు నష్టాలను మిగుల్చుతున్నాయి. గతంలో టన్ను రూ.60 వేలు పైగా కొనుగోలు జరిగేవి. ప్రస్తుతం తోటల వద్ద టన్ను 20 వేల నుంచి 23 వేలకు మించి కొనుగోలు జరగడం లేదు. చీనీ తోటలను సాగు చేసేందుకు అధిక మొత్తంలో ఎరువులు, పురుగు మందులకు ఖర్చు చేయాల్సివస్తోంది. ప్రస్తుతం ఉన్న చీనీ ధరలతో పోల్చుకుంటే సాగు చేసిన ఖర్చులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీనీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి దక్కడం కష్టమే



రామిరెడ్డిపల్లెలో నాకు 8 ఎకరాల చీనీ తోట ఉంది. గత ఏడాది ఈ సీజన్‌లో టన్ను రూ.40 వేల నుంచి 50 వేలవరకు ధర పలికింది. ప్రస్తుతం ఈ సీజన్‌లో ధర పతనం కావడంతో రూ.18 నుంచి రూ.23 వేల వరకు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పెట్టుబడి దక్కడం కష్టమే. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి చీనీ రైతులను ఆదుకోవాలి.

- మలికిరెడ్డి వీరనారాయణరెడ్డి, చీనిరైతు, కొండాపురం

15 ఎకరాలల్లో చీనీ సాగు చేశా



20 సంవత్సరాల నుంచి 15 ఎకరాల్లో చీనీ మొక్కలు సాగు చేస్తున్నాను. ఎకరానికి ఎరువులు పిచికారి చేయాలంటే గతంలో కన్నా ఖర్చులు అమీతంగా పెరిగాయి. దీనికి తోడు చీనీ కాయలు అమ్ముదామనుకుంటే ధరలు లేవు. గత ఎడాదిలో టన్ను ధర మంచిరేటు పలికింది. ప్రస్తుతం ఐదు నెలలనుంచి ధర లేదు. సాగు చేస్తున్న చీనీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఎం.అమరేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డిపల్లె

రైతులకు కొనుగోలు బిల్లులు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయ పరిధిలో ఎరువులు కొనుగోలు చేసే రైతులకు డీలర్లు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన పులివెందుల, వేముల, లింగాల మండలాలకు చెందిన పురుగుమందులు, ఎరువు విత్తనాల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీలర్లు అనుమతులులేని ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డీలర్లకు ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఏ మందులు వాడాలి.. ఎంత మోతాదులో ఇవ్వాలి అని వివరించారు. అలాగే దుకాణాల్లో లైసెన్స్‌లు కనిపించే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రికార్డుల్లో స్టాక్ ఎంత ఉంది.. వాటి వివరాలను పొందుపరచాలన్నారు. ముఖ్యంగా అనుమతులులేని గ్లెఫోసెట్ మందు విక్రయించరాదన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించి రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శివారెడ్డి, సేల్స్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు


కృష్ణాష్టమి వేడుకల్లో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, విద్యార్థులు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించినట్లు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు నృత్యప్రదర్శనలు చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో అందరినీ అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చైతన్యరెడ్డి, చేతన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు విజయవంతం చేయండి

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక శ్రీకృష్ణ దేవస్థానం నిర్వాహకుడు రామాంజనేయులు కోరారు. స్థానిక వడ్డెరవీధిలో వెలసిన శ్రీకృష్ణ దేవస్థానం నందు ఈనెల 26న ఉదయం 8.30గంటల నుండి అర్చకులు దుర్వాక ప్రసాద్‌శర్మ నేతృత్వంలో పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 5గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు.

గండి అంజన్న సేవలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు


అంజన్న సేవలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

వేంపల్లె : శ్రావణమాసం సందర్భంగా గండి అంజన్న సేవలో ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. శ్రావణమాసం మూడో శనివారం నేపథ్యంలో గండి వీరాంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు విద్యార్థులు వివిధ సేవలు అందించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు అమరేంద్రకుమార్ సంద్రా, అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తమ విద్యార్థులు అన్నదానం, లడ్డు విక్రయం, మంచినీరు, రక్తదానం తదితర సేవల్లో పాల్గొన్నారు. ప్రతి ఏడాది శ్రావణ మాస ఉత్సవాల్లో తమ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భక్తులకు సేవలు అందించారన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురం సమీపంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో నేటి నుంచి 27వ తేదీ వరకు ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు, శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలతో పాటు ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీగణపతి కోలాటం బృందం మాస్టర్ కిషోర్ ఆధ్వర్యంలో చిన్నారులచే కోలాటం నిర్వహించనున్నారు.

నేత్రదానంతో అంధులకు చూపు


తులసి పార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించిన నేత్రనిధి సిబ్బంది

పులివెందుల రూరల్ : పట్టణంలోని చెన్నారెడ్డికాలనీకి చెందిన చప్పిడి నారాయణమ్మ శనివారం మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రసేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం అందించారు. ఆయన టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు తెలిపారు. ఎవరైనా మరణించినప్పుడు నేత్రదానం చేయాలనుకున్న కుటుంబసభ్యులు 9966509364, 7093204537లకు ఫోన్ చేయాలన్నారు. అలాగే పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న గోకనపల్లి తులసి మృతి చెందింది. ఆమె భర్త నేత్రదానానికి అంగీకరించడంతో ఆమె కార్నియాలను సేకరించామని ఆయన తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జమ్మలమడుగు : పట్టణంలోని తాడిపత్రి రహదారిలో ఉన్న ఆరోరా క్లినిక్‌లో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రి వైద్యులచే ఉచితంగా రక్తనాళాల వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆరోరా క్లీనిక్ నిర్వాహకుడు డీఎంఎస్ రాజు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కాళ్లకు ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు, సాలేపురుగు వంటి నరాలు, కాలు, పాదం వాపు, సిరపుండ్లు, కాళ్లలో రక్తసరఫరా కాకపోవడం, తలకు రక్త సరఫరా కాకపోవడం వంటి వ్యాధులకు వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు రోగులకు 4500 రూపాయల విలువ గల వెవైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అమరుల స్ఫూర్తితో ఉక్కు పరిశ్రమ సాధిద్దాం

జమ్మలమడుగు : అమర వీరుల స్ఫూర్తితో కడప ఉక్కుపరిశ్రమ సాధన కోసం పోరాటం కొనసాగిద్దామని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సమరయోధుడు రాజ్‌గురు జయంతి సందర్భంగా ఐటీఐ కాలేజీలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమను సాధించుకునేందుకు యువత, విద్యార్థులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేసి కేంద్ర ప్రభుత్వం మాత్రం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకుండా మీనమేషాలు వేస్తుందన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం


వేములలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న సీడీపీఓ సునీత


సింహాద్రిపురంలో బహుమతులను ప్రదానం చేస్తున్న సీడీపీఓ శ్రీలత

వేముల : వేములలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు ఈనెల 14న 1098, 181 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన కీర్తన, మహాలక్ష్మి, పూజితలకు సీడీపీఓ సునీత బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆమె చైల్డ్ హెల్ప్ లైన్, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : స్థానిక కస్తూర్బా పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు ఈనెల 14న 1098,181 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన హరిప్రియ, నవ్య, రూపరెడ్డిలకు సీడీపీఓ శ్రీలత బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురుదేవి, సూపర్‌వైజర్ వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


కల్యాణ వేదికపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారు


ఎగువపల్లెలో కోలాటం వేస్తున్న చిన్నారు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారికి మూడవ శ్రావణ శనివారం సందర్భగా ఆలయ ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకొని కల్యాణాన్ని తిలకించారు. అలాగే ఎగువపల్లె గ్రామంలో వెలసిన అంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అవరణలో చింతకొమ్మదిన్నెకు చెందిన కోలాట బృందం సభ్యులు కోలాటం నృత్యాలు వేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వెల్లువెత్తిన శుభాకాంక్షలు


రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజుల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న షేక్ ఇస్మాయిల్

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కమలాపురం మాజీ శాసనసభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఆయ న్ను ప్రత్యేకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, షఫీ, కోలాకొండయ్య, అజ్మతుల్లా, బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి, మల్లీ శ్వ రి, తలశమ్మ, పద్మ, సుశీలమ్మ తదితరులు నూతన జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డికి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డికి అభినందనలు తెలిపారు.

కమలాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కమలాపురం మాజీ శాసనసభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డికి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ శుభాకాంక్షలు తెలిపారు. చిత్రపటాలు అందజేశారు.

ఆసుపత్రిలో విద్యుత్ కాంతులు


పీహెచ్‌సీలో వెలుగుతున్న విద్యుత్ దీపాలు

లింగాల : అంధకారంలో ఆసుపత్రి అనే వార్తకు అధికారులు స్పందించారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో అంధకారంలో ఆసుపత్రి అన్న వార్త ప్రచురితమైంది. దీంతో శుక్రవారం రాత్రి పీహెచ్‌సీ అధికారులు ఆసుపత్రిలో విద్యుత్ దీపాలు అమర్చారు. కొంత కాలంగా ఆసుపత్రిలో విద్యుత్ దీపాలు వెలుగకపోవడం వాస్తవమేనని సీహెచ్ఓ శివరాం తెలిపారు.

వైవీయూ ప్రతిష్టను కాపాడాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : వైవీయూ వీసీ కృష్ణారెడ్డిని తొలగించి యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వల రాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినవారు విద్యాసంస్థల్లో పదవులలో ఉండటం నేరమన్నారు.

నీట్ పీజీ ఫలితాల్లో సత్తా


తల్లిదండ్రులతో విద్యార్థిని దివ్యప్రీతి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని ఓంశాంతి కాలనీకి చెందిన వై.దివ్యప్రీతి ఆల్ ఇండియా నీట్ పీజీ ప్రవేశ ఫలితాల్లో 99.92 శాతంతో 178వ ర్యాంకు సాధించింది. దివ్యప్రీతి విజయవాడలోని చైతన్య కళాశాలలో ఇంటర్ చేసింది. ఎంసెట్‌లో ఉత్తమ ర్యాకు సాధించడంతో కర్నూలులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇటీవలనే ఎంబీబీఎస్ కోర్స్ పూర్తి చేసుకుని పీజీ రాయగా 178వ ర్యాంక్ వచ్చింది. ఈ సందర్భంగా విద్యార్థిని వై.దివ్యప్రీతి మాట్లాడుతూ పీజీలో జనరల్ మెడిసిన్ చేయనున్నట్లు తెలిపారు. తండ్రి వై.రామచంద్రారెడ్డి మైలవరం మండలం ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి శ్రీదేవి గృహిణిగా ఉన్నారు. తమ కూతురు ఉత్తమ ర్యాంక్ సాధించడం తమకు ఆనందంగా ఉందని వారు తెలిపారు.

న్యూట్రల్ పైపుల దొంగలు పట్టివేత


స్వాధీనం చేసుకున్న న్యూట్రల్ పైపులు

వేంపల్లె : మండలంలోని అమ్మవారిపల్లె గ్రామంలో న్యూట్రల్ పైపుల దొంగలను స్థానిక ప్రజలు పట్టుకున్నారు. వ్యవసాయ బోర్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద న్యూట్రల్ పైపులను అమరుస్తారు. కొందరు ఆకతాయిలు మద్యానికి బానిసై చిన్న చిన్న దొంగతనాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో కొన్ని నెలలుగా ఆ గ్రామంలో న్యూట్రల్ పైపుల దొంగతనాలు చేయడంతో రైతులు చాలా ఇబ్బందులు పడేవారు. అయితే శనివారం ఆ గ్రామ రైతులందరూ దొంగలను ఎలాగైనా పట్టుకోవాలనే ఉద్దేశంతో కాపు కాచి న్యూట్రల్ పైపులను దొంగలిస్తుండగా ముగ్గురిని పట్టుకున్నారు. ఒకరు నంది మండలం గ్రామానికి చెందినవాడు కాగా, మరో ఇద్దరు వేంపల్లిలోని శ్రీరామ్ నగర్ వీధి, రాజీవ్‌కాలనీలలో నివాసం ఉంటున్నారు. ఆ గ్రామ రైతులు ముగ్గురిని పట్టుకొని వేంపల్లి పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. గతంలో కూడా వీరు వివిధ ప్రాంతాలలో ఇలాంటి దొంగతనాలు చేసుకుంటూ మద్యం సేవించే వారని రైతులకు తెలియజేశారు. దొంగలను పట్టుకుని పోలీస్ స్టేషన్లో అప్పగించడంతో సీఐ సురేష్‌రెడ్డి రైతులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా మరియమాత గ్రామోత్సవం

వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన పునీత మరియ మాత మాతృత్వపు దేవాలయ (చర్చి) సిల్వర్ జూబ్లీ వేడుకల్లో శనివారం మరియ మాత గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శివాలయం వద్ద నుంచి శీతోరుపల్లె వరకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. నెల్లూరు వారు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విచారణ గురువు ఫాదర్ జీవన్ కుమార్, ఫాదర్ చిన్నప్పల ఆధ్వర్యంలో చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు.

ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. సాయంత్రం జపమాల, దివ్య సత్ప్రసాద స్తుతి ఆరాధన నిర్వహించారు. అనంతరం దివ్యబలి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.